

02లో

## వైభవంగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు

- ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్‌లో ప్రత్యేక పూజలు


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం సెప్టెంబర్ 17, 2026 పేజీలు:13




# వినాయక మండపాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

## - మండపాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డి.జానకి

మహమ్మదాబాద్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి )

దేశాయి పల్లి X రోడ్ లో గల శ్రీ అక్షర గ్రామర్ స్కూల్ లో వినాయక నిమజ్జన కార్యక్రమం భక్తి శ్రద్ధ లతో జరిపించారు. బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో లో వైభవం గా నిర్వహించారు. ముందుగా విగ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శోభయాత్రగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. విధార్థుల సాంస్కృతిక కార్యమాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రహ్లాద్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ వల్ల విద్యార్థుల్లో భక్తి బావన తో పాటు ఐక్యత క్రమశిక్షణ వంటి నైతిక విలువలు పెంపొందు తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు రాజు, కృష్ణయ్య, రాధ, సువర్ణ, ఆస్మిత, కృష్ణమ్మ, మనీష, కవిత, శాజీదా, భోధనేతర సిబ్బంది జావిద్, సత్యయ్య, అర్జున, చెన్నమ్మ తో పాటు తల్లి దండ్రులు, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాసులు, కృష్ణయ్య, భీమయ్య, హనుమంతు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వినాయక మండపాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

## - మండపాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ దరావత్ జానకి బుధవారం పరిశీలించారు. వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు మండపాలను ఆమె సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. వినాయక నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. విద్యుత్ వైరింగ్, అగ్ని ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని ఎస్పీ జానకి తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ సీనయ్యతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# వైభవంగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు

## -ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్‌లో ప్రత్యేక పూజలు

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ పాటిల్ స్వయంగా అన్న ప్రసాదాన్ని వితరణచేసి వినాయక చవితిని పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,డీఎస్పీలు,సీఐలు,ఆర్ఐలు, ఎస్.ఐ లు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నగరాభివృద్ధికి సమగ్ర పరిష్కారాలే మార్గం

- ఢిల్లీలో 'షెహెరోన్ పే చర్చా'లో కేటీఆర్
- ప్రజల కోసం పనిచేసే నగరాలపై చర్చ
- తెలంగాణలో అమలు చేసిన విధానాల ప్రస్తావన
- భారత నగరాల భవిష్యత్‌పై విస్తృత చర్చ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

భారత నగరాల అభివృద్ధికి తాత్కాలిక స్పందనల కంటే సమగ్ర పరిష్కారాలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు అనుకూలంగా నగరాలను తీర్చిదిద్దే అంశంపై నిర్వహించిన 'షెహెరోన్ పే చర్చా' కార్యక్రమంలో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎన్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జనాగ్రహ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. దేశంలోని నగరాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎలా పనిచేయాలనే అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నిపుణులు పాల్గొని అభిప్రాయాలు పంచుకున్నారు. మహువా మాజి, ఎస్ నిరంజన్ రెడ్డి, జనాగ్రహ ప్రధాన కార్యనిర్వాహక అధికారి శ్రీకాంత్ విశ్వనాథన్‌తో కలిసి జరిగిన ప్యానెల్ చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన సమయంలో నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సేవల మెరుగుదల కోసం అమలు చేసిన పలు విధానాలు, కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో నగరాల నిర్వహణకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని చర్చలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, గృహ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిగణించి అభివృద్ధి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భారత నగరాలు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం, సమర్థ పరిపాలన, ఆధునిక సాంకేతికత వినియోగం కీలకమని పాల్గొన్నవారు పేర్కొన్నారు. నగరాల అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. దేశంలోని నగరాలను మరింత జీవనోపయోగకరంగా, సుస్థిరంగా మార్చే దిశగా చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమంలో విస్తృత చర్చ జరిగింది. ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని రూపొందించే విధానాలే భవిష్యత్ నగరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# ఎల్కూర్ పల్లె దవాఖానలో అందుబాటులో ఉండని ఏఎన్ఎం నాగమ్మ

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎం ను - జిల్లా కలెక్టర్ స్పందించి సస్పెండ్ చేయాలని గ్రామ ప్రజల డిమాండ్

**ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలోని పల్లె దవాఖానలో ఏఎన్ఎం నాగమ్మ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో వైద్య సేవల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రతి బుధవారం తల్లులు,శిశువులు,గర్భిణులకు అందించాల్సిన టీకాలు సక్రమంగా అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆగస్టు 15న పల్లె దవాఖాన వద్ద జాతీయ జెండా ఎగురవేయలేదని, నెలకు ఒకసారి నిర్వహించే గ్రామ సభకు కూడా ఏఎన్ఎం హాజరు కావడం లేదని ఆరోపించారు.ఏ.ఎన్.ఎం విధులపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి,సస్పెండ్ చేయాలని గ్రామ ప్రజలు కోరారు.ఈమె స్థానంలో మరొక ఏఎన్ఎం ను నియమించి పల్లె దవాఖానలో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# భారత్‌మాల సిక్స్‌లైన్ హైవేపై రాజోలి రైతుల సమస్యల పరిష్కారానికి సమస్యలు పరిష్కరించండి

**ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

మహబూబ్‌నగర్‌లో బుధవారం ఎన్. హెచ్. ఎ ఐ.ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. కె బన్సల్ గారిని కలిసి రాజోలి గ్రామం మీదుగా వెళ్తున్న భారత్‌మాల సిక్స్‌లైన్ హైవేకు సంబంధించి రైతులకు ఎదురవుతున్న సమస్యలు, అలాగే గ్రామ ప్రజలకు అవసరమైన ఎంట్రీ & ఎగ్జిట్ సదుపాయాల విషయాలను వివరించి వినతి పత్రం సమర్పించడం జరిగింది. రైతుల సమస్యలపై ఎం.కె బన్సల్ సానుకూలంగా స్పందించి, అతి త్వరలో ఒక అధికారిని రాజోలి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజోలి గ్రామ సర్పంచ్ సి. గంగిరెడ్డి , జోగులాంబ గద్వాల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వై. ఎల్లారెడ్డి , మాజీ మండల అధ్యక్షులు దస్తగిరి , రాజోలి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. హసన్ , శ్రీ వైకుంఠ నారాయణ స్వామి దేవాలయ ధర్మకర్త ఏ. గోపి పాల్గొన్నారు రైతుల ప్రయోజనాలు కాపాడుతూ ప్రజలకు సరైన ఎంట్రీఎగ్జిట్ సదుపాయాలు కల్పిస్తూడ రాజోలి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి కొనసాగుతుంది! రాజోలి ప్రజల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం. వారు అన్నారు





# మేడికొండలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి

## మూడు నెలలుగా జీతాలు అందలేదని కార్మికుల ఆవేదన

**ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మేడికొండ గ్రామంలో గత మూడు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత పనులు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని కార్మికులు తెలిపారు.గత నెలలోనే జీతాలకు సంబంధించిన నిధులు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అయినప్పటికీ తమకు ఇప్పటివరకు చెల్లింపులు జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా చేరిన ముగ్గురు కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, అందుకే ఇంటి పన్ను వసూళ్ల ద్వారా వచ్చిన నిధులతో అందరికీ జీతాలు చెల్లిస్తామని గ్రామ సెక్రటరీ తెలిపినట్లు కార్మికులు పేర్కొన్నారు. అదేవిధంగా జీతాలు అందక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోయారు. మరోవైపు పారిశుద్ధ్య పనులు నిలిచిపోవడంతో గ్రామంలో చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు నిండిపోవడంతో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు, పంచాయతీ ఖాతాలో నిధులు ఉన్నప్పటికీ చెల్లింపులు ఎందుకు ఆలస్యమయ్యాయనే అంశంపై విచారణ జరిపి, గ్రామంలో పారిశుద్ధ్య పనులను తక్షణమే పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# నేడు జిల్లా పార్టీ కార్యాలయంలో బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకలు

**ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 09:15 గంటలకు నియోజకవర్గ లిబిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరుకానున్నారు. కావున,మాజీ మున్సిపల్ చైర్మన్ లు ,సర్పంచులు,కౌన్సిలర్లుమాజీ జడ్పీటీసీలు,మాజీ ఎంపీపీలు,మాజీ సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని,విజయవంతం చేయవలసిందిగా వారు తెలిపారు

# 10వ బెటాలియన్ యువ ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి)**

సెప్టెంబర్ 16:10వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ బీచుపల్లి నందు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి 10వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ బి. ఆదినారాయణ మరియు మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి ఏ.నిర్మల ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అత్యవసర పరిస్థితులు,ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర విపత్తులు సంభవించినప్పుడు సంబంధిత అత్యవసర సేవల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపు, సమీపంలో ఉన్న యువత తమకు అందుబాటులో ఉన్న వనరులతో బాధితులకు ప్రాథమిక సహాయం అందించడం, ప్రాణాలను రక్షించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టేలా యువతను సిద్ధం చేయడం యువ ఆపదమిత్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల పాటు విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,బాధితులను సురక్షితంగా రక్షించే విధానాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసే విధానాలపై శిక్షణఅందించనున్నారు.ఈ శిక్షణలో ముఖ్యంగా:విపత్తుల సమయంలో అత్యవసర ప్రతిస్పందన మరియు రక్షణ చర్యలుప్రథమ చికిత్స మరియు గాయపడిన వారికి తక్షణ సహాయంసి పి ఆర్ మరియు ప్రాథమిక ప్రాణరక్షణ పద్ధతులువరదలు,భారీ వర్షాలు తదితర నీటి విపత్తుల సమయంలో రక్షణ చర్యలుఅగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు రక్షణ విధానాలుభూకంపాలు,భవనాల కూలిపోయే పరిస్థితుల్లో సురక్షితంగా స్పందించే విధానాలుప్రమాద స్థలంలో బాధితులను గుర్తించడం,సురక్షితంగా తరలించడం మరియు అత్యవసర సహాయం అందించడంవిపత్తుల సమయంలో స్వీయ రక్షణ, కమ్యూనికేషన్ మరియు సమన్వయంఅత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవగాహన కల్పించడం,తరలింపు విధానాలుసహాయక చర్యల్లో ఉపయోగించే ప్రాథమిక రెస్క్యూ పరికరాల వినియోగంవంటి అంశాలపై సైద్ధాంతిక మరియు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.ఈ శిక్షణలో ఎన్ఎస్ఎస్ నుంచి 43 మంది,బి ఎస్ జి 17 మంది,ఎన్ వై కే ఎస్ నుంచి 31 మంది, మొత్తం 91 మంది బాలబాలికలు పాల్గొంటున్నారు.వీరు మహబూబ్‌నగర్, వనపర్తి,నారాయణపేట, జోగులాంబ గద్వాల మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందినవారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విపత్తులు సంభవించిన సమయంలో ప్రభుత్వ అత్యవసర సేవల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునే వరకు స్థానికంగా శిక్షణ పొందిన యువత అందించే తక్షణ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,యువ ఆపదమిత్రలుగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజంలో ప్రాణరక్షణ చర్యలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పార్థసారథి రెడ్డి, వెంకటరమణ,ఆర్ఐ శ్రీనివాస్,లక్ష్మణ్ బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# అంతర్జాతీయ బాల్యవివాహాల నిర్మూలన దినోత్సవం ప్రకటించడం గర్వకారణం:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**గద్వాల సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



బాల్యవివాహాల నిర్మూలనకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌డీఎస్) చేస్తున్న కృషి ప్రశంసనీయమని,సంస్థకు సంబంధిత అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బాల్యవివాహాలు,బలవంతపు వివాహాల నిర్మూలన కోసం నవంబర్ 27వ, తేదీని అంతర్జాతీయ దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిన నేపథ్యంలో,రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,2025 నవంబర్ 27న భారతదేశంలో సుమారు 250 మిలియన్ల మంది పౌరులు బాల్యవివాహాల నిర్మూలనకు ఆర్‌డీఎస్ వ్యవస్థాపకుడు భువన్ రిభు సంకల్పంతో ప్రతిజ్ఞ చేశారని తెలిపారు.ఈ నేపథ్యంలో నవంబర్ 27వ,తేదీని బాల్యవివాహాల నిర్మూలన దినంగా ప్రతిపాదించగా ఐక్యరాజ్యసమితి ఆమోదించడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.స్త్రీ,శిశు సంక్షేమ శాఖతో పాటు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు జిల్లాలో జరుగుతున్న బాల్యవివాహాలపై నిరంతరం నిఘా ఉంచి,వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహం జరగబోతున్నట్లు సమాచారం తెలిసినట్లయితే స్వచ్ఛంద సంస్థలు, యువత,ఇతర పౌరులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సునంద, ఆర్‌డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్,జిల్లా కోఆర్డినేటర్ ఎడ్విన్,చంద్రశేఖర్, ధనలక్ష్మి,విద్యుల్లత,సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల చదువులో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలి

## - సెప్టెంబర్ పిటిఎంల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల ప్రదర్శనకు ప్రత్యేక కార్యక్రమాలు
## - ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత దృష్టి: డీఈఓ ఐ. విజయకుమారి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పిల్లల విద్యలో తల్లిదండ్రులను క్రియాశీల భాగస్వాములుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సెప్టెంబర్ నెల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి తెలిపారు. "తల్లిదండ్రులతో భాగస్వామ్యం ప్రతి విద్యార్థి అభ్యసనానికి సాధికారత" అనే ప్రధాన అంశంతో ఈ నెల పిటిఎం లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో తమ ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రదర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు.

**ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సాహం :**

విద్యార్థులు సరళమైన ఆంగ్ల వాక్యాలతో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేలా కల్చరల్ షో & టెల్, పిక్చర్ డిస్క్రిప్షన్, రోల్ ప్లే, ఫెస్టివల్ టైమ్లైన్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇంట్లో జరుపుకునే పండుగలు, ఆహారం, సంప్రదాయాల గురించి ఆంగ్లంలో మాట్లాడటం, చిత్రాలను చూసి సరళమైన వాక్యాలతో వివరించడం, మార్కెట్ లేదా వైద్యుడి వద్ద వంటి సాధారణ పరిస్థితులను పాత్రధారణ ద్వారా ప్రదర్శించడం వంటి కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. అలాగే జనవరి నుంచి డిసెంబర్ వరకు వివిధ పండుగలను గుర్తించి వాటి గురించి ఒకటి రెండు ఆంగ్ల వాక్యాలు చెప్పేలా విద్యార్థులను ప్రోత్సహించనున్నారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడే సమయంలో వ్యాకరణపరమైన తప్పులను వెంటనే సరిదిద్దకుండా, వారి ప్రతి ప్రయత్నాన్ని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అధికారులు పేర్కొన్నారు.

**ఇంటివద్ద కూడా అభ్యసనానికి ప్రోత్సాహం:**

పిల్లల అభ్యసనం పాఠశాలకే పరిమితం కాకుండా ఇంటివద్ద కూడా కొనసాగేందుకు తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలను పాఠశాలలో జరిగిన ఒక విషయాన్ని ఆంగ్లంలో చెప్పమని అడగాలని సూచించారు. పిల్లలు ఆంగ్లంలో మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా విని, తప్పులను వెంటనే సరిదిద్దకుండా ప్రోత్సహించాలని తెలిపారు.అదేవిధంగా బిస్కెట్ ప్యాకెట్లు, మందుల డబ్బాలు, రోడ్డు సూచికలు తదితర రోజువారీ వస్తువులపై కనిపించే ఆంగ్ల పదాలను పిల్లలతో కలిసి చదివే అలవాటు చేయాలని సూచించారు.

**ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి:**

పిటిఎం సందర్భంగా ప్రతి తల్లిదండ్రితో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాట్లాడి విద్యార్థి ప్రగతి, రిపోర్ట్ కార్డు, విద్యార్థి బలాలు, ఇంటివద్ద కనిపిస్తున్న మంచి ప్రవర్తన, ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలపై చర్చించనున్నారు. పిల్లల్లో నిరుత్సాహాన్ని కలిగించే విధంగా కాకుండా, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కలిసి విద్యార్థి అభివృద్ధికి కృషి చేసేలా చర్చలు సాగాలని డీఈఓ సూచించారు.

**తల్లిదండ్రుల అభిప్రాయాలకు ప్రాధాన్యం:**

పిటిఎం అనంతరం తల్లిదండ్రుల అభిప్రాయాలను నమోదు చేయడంతో పాటు, విద్యార్థుల ప్రదర్శనపై వారి స్పందనలను కూడా సేకరించనున్నారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రుల వివరాలు, ఫొటోలు, వీడియోలు, పిటిఎం కు సంబంధించిన సమాచారాన్ని అదే రోజు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు కేవలం సమావేశాలకు హాజరయ్యే వారిగా కాకుండా, పిల్లల అభ్యసన ప్రయాణంలో భాగస్వాములుగా మారాలని డీఈఓ ఐ. విజయకుమారి పిలుపునిచ్చారు. ఇంటివద్ద ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో మాట్లాడటం, వినడం, చదవడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా విద్యార్థుల అభ్యసనానికి ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతి విద్యార్థి అభ్యసనం మరింత బలోపేతం అవుతుందని డీఈఓ తెలిపారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

## - నిమజ్జన ప్రదేశాల్లో భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
## - ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



వినాయక విగ్రహాల నిమజ్జనం సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గుర్తించిన చెరువులను ఆయన పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి ఇప్పటికే చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన భద్రతా చర్యలు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, మున్సిపల్ చైర్మన్‌తో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు

## - అక్రమ మద్యం, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**



జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సి. హెచ్. చంద్రశేఖర్ బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆమె గదిలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌కు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు తెలిపారు. జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ అక్రమ మద్యం తయారీ, విక్రయాలు, రవాణాతో పాటు మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నిబంధనలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, ప్రభుత్వ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేస్తూ, ఎక్సైజ్ శాఖ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.

# టీ.జీ.ఐపాస్ అనుమతులు గడువులోగా మంజూరు చేయాలి

- పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను టీ.జీ.ఐపాస్ ద్వారా నిర్దేశిత గడువులోగా మంజూరు చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశంలో ఆయన పాల్గొని పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించిన అనుమతులు, పారిశ్రామిక వాడల్లో పెండింగ్ పనులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను పరిశీలించిన అదనపు కలెక్టర్, ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలేపల్లి సెజ్ పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న వర్షపు నీటి కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే సెజ్‌లో ప్రతిపాదిత చెత్త నిల్వ కేంద్రం ఏర్పాటుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని టీ.జీ.ఐఐసీ అధికారులను ఆదేశించారు. టీ.జీ. ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిశీలించి అనుమతులు, అనుమతి పత్రాలు, ఇతర ప్రక్రియలను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని అన్నారు. దరఖాస్తుల్లో లోపాలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని స్పష్టంగా నమోదు చేసి, దరఖాస్తుదారులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా మరిన్ని పెట్టుబడులు ఆకర్షించాలని అన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు, ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి:**

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను విస్తృతంగా ప్రచారం చేసి అర్హులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. చిన్న పెట్టుబడులతో సేవా రంగ యూనిట్లకే పరిమితం కాకుండా, సాధ్యమైన మేరకు తయారీ రంగంలో పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటు చేసేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లభించే రాయితీలను సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలను స్థాపించేలా లబ్ధిదారులకు సరైన మార్గదర్శకత్వం అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలకు ప్రాజెక్టు ఎంపిక, పెట్టుబడి, మార్కెట్, బ్యాంకు రుణాలు, సాంకేతిక అంశాలపై అవసరమైన సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో 15 మంది ఎస్సీ, 16 మంది ఎస్టీ, మొత్తం 31 మంది లబ్ధిదారులకు వాహనాల కోసం పెట్టుబడి రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, టీ.జీ.ఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్లు టీ.వి. ప్రసాద్, నాగరాజ్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అభివృద్ధి శాఖల అధికారులు, విద్యుత్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఎస్‌టీయూటీఎస్ 80వ వసంత వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

- విద్యా వ్యవస్థ అభివృద్ధికి సంఘం చేస్తున్న కృషి అభినందనీయం : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టీయూటీఎస్) 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వసంతోత్సవాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఎస్‌టీయూటీఎస్ సంఘ నాయకుల సమక్షంలో 80వ వసంతాల వైభవోత్సవాల గోడపత్రికను కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌టీయూటీఎస్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా, విద్యా వ్యవస్థ అభివృద్ధికి కూడా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యా రంగ పురోగతికి సంఘం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని నాగోల్‌లో నిర్వహించనున్న ఎస్‌టీయూటీఎస్ 80వ వసంత వేడుకలు ఘనంగా, విజయవంతంగా జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సిములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్, జిల్లా కార్యదర్శులు క్రాంతి కిషోర్, నాగేంద్రకుమార్, దాసప్ప, అనంతరెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.




# ఓటర్ల జాబితా సవరణపై పార్టీల ప్రతినిధులతో సమీక్ష

- నోటీసుల పంపిణీ, విచారణలు పారదర్శకంగా నిర్వహించాలి: ఈఆర్ఓ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

76దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణపై ఈఆర్ఓ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు.బుధవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరై తమ వివరాలు, అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం విచారణ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.నోటీసుల పంపిణీ, విచారణల సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గుర్తించే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా అవగాహన కల్పించి, ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో దేవరకద్ర తహసీల్దార్, ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నేడు మహబూబ్‌నగర్ జిల్లాకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్

## - భూ, ఎస్సీఎస్టీ అట్రాసిటీ అంశాలపై అధికారులతో సమీక్ష

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నేతృత్వంలోని కమిషన్ బృందం గురువారం (సెప్టెంబర్ 17) మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనుంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు సభ్యులు కుసుం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్ ఈ పర్యటనలో పాల్గొననున్నారు. కమిషన్ చైర్మన్ అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డీసీఓ/ఆర్సీఓలు, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొననున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఎస్సీఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసులు, వాటికి సంబంధించిన చర్యలు, కేసుల పురోగతి తదితర అంశాలపై కమిషన్ అధికారులు సమీక్ష నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను అధికారులు సమర్థవంతంగా పరిష్కరించడం, బాధితులకు చట్టపరమైన సహాయం, రక్షణ కల్పించడం, పెండింగ్‌లో ఉన్న అంశాలపై తీసుకున్న చర్యలను కమిషన్ సమీక్షించనున్నట్లు సమాచారం.

# దేవరకద్ర పీహెచ్‌సీలో వైద్య సేవలపై అదనపు కలెక్టర్ ఆరా

## - రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం, మందుల లభ్యతపై వివరాల సేకరణ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను సందర్శించిన అదనపు కలెక్టర్ అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం, మందుల లభ్యత, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై వివరాలు సేకరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన ఆయన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ ఆవరణలో టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించి, ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతం చేయాలి

## 'కల్పిత నాయకుడు' అంటూ అంబేద్కర్‌ను అవమానించడం సరికాదు

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలతో 'కల్పిత నాయకుడు' అనే భావనతో పుస్తకాన్ని రచించి ప్రచురించేందుకు ప్రయత్నిస్తున్న హమారా ప్రసాద్ చర్యలను నిరసిస్తూ దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కళాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు వక్తలు హమారా ప్రసాద్ చర్యలను తీవ్రంగా ఖండించారు. సమాజంలోని అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకనాయకుడైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని అవమానించే ప్రయత్నాల కంటే ఆయన చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, హక్కుల సాధన మార్గాన్ని యువతకు పరిచయం చేయడం ముఖ్యమన్నారు. అంబేద్కర్ ఆశయాలను సమాజంలో మరింత బలంగా ప్రచారం చేయడంతో పాటు, ఆయన రచనలు, రాజ్యాంగ విలువలపై విస్తృత చర్చలు నిర్వహించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ గౌరవం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని వక్తలు సూచించారు.



# పాఠశాల పారిశుద్ధ్యంపై అదనపు కలెక్టర్ ఆరా

## - ధర్మాపూర్ జెడ్‌పీహెచ్‌ఎస్‌లో పనులను పరిశీలించిన మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ధర్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ పరిసరాల పరిశుభ్రత, కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన మధుసూదన్ నాయక్ వారి చదువు, విద్యా పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాలలో పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.



# పురాణ ఘట్టాలతో ఆకట్టుకుంటున్న (స్వకుల సాలి సమాజ్) వినాయక మండపం

## - 53 ఏళ్లుగా వినూత్న అలంకరణలు

## - చిన్నారులకు పురాణ పరిచయం

**ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయ స్వకులశాలి సమాజం ఆధ్వర్యంలో 53 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా వినూత్న రీతిలో వినాయక మండపాన్ని అలంకరిస్తూ వస్తున్నారు. 1971లో గద్వాల మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పాగా పుల్లారెడ్డి ఆధ్వర్యంలో గద్వాలలో తొలిసారిగా వినాయక చవితి వేడుకలు ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. 1973 నుంచి పాండురంగ స్వామి ఆలయ స్వకులశాలి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విభిన్న పురాణ ఘట్టాలను ప్రతిబింబించేలా అలంకరణలు చేపడుతున్నారు. అదేవిధంగామహాభారతం, భాగవతం వంటి ఇతిహాస, పురాణాల్లోని ముఖ్యమైన ఘట్టాలను కళ్లకు కట్టినట్లు మండపాల్లో ఏర్పాటు చేస్తూ చిన్నారులు, యువత, ప్రజలకు మన పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా అలంకరణలు చేస్తున్నారు. ఈ సన్నివేశాలను చూసే వారికి అప్పటి పురాణ కథలు సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ఈ ఏడాది స్వకులశాలి యువజన సంఘం అధ్యక్షుడు కామ్లే శ్రీనివాస్, కమిటీ ఆధ్వర్యంలో అమృత భాండం కోసం దేవతలుదానవులులి క్షీరసాగరాన్ని మథించిన ఘట్టాన్ని వినూత్నంగా రూపొందించారు ఆకట్టుకునే విధంగా రూపొందించిన ఈ అలంకరణను గద్వాల పట్టణ ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అనంతరం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను స్వకులశాలి సమాజం అధ్యక్షుడు కామ్లే శ్రీనివాస్, కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వకులసాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు దేవుజి రాఘవేందర్, కార్యదర్శి సాక్రె శ్రీనివాస్, దోత్రే సురేంద్రబాబు, కార్యవర్గ సభ్యులు గణప నరేందర్, కాంబ్లే ప్రవీణ్, గచ్చి వీరన్న, దోత్రే ప్రమోద్, సఫారీ అజయ్, సఫారీ సురేష్, జిందే కార్తీక్ తదితరులు కుల బాంధవులు మాజీ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



# బీసీ మహిళలకు 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్'

## దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకానికి అర్హులైన మహిళల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి. విష్ణు నందన్ తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే కుట్టుపని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను టీ–జీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకుని ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని విష్ణు నందన్ కోరారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# నేడు ప్రజాపాలన దినోత్సవం

## - విద్యుత్ దీపాలతో ముస్తాబైన కలెక్టరేట్

## - 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ

## - ముఖ్య అతిథిగా సిరిసిల్ల రాజయ్య

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగానాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యఅతిథిగా నియమించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజయ్య హాజరై ఉదయం 10 గంటలకు జాతీయప తాకాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజాపాలన దినోత్సవం సం దర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు,వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఘనంగా,క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ,వేదిక ఏర్పాట్లు,బందోబస్తు,పార్కింగ్,తాగునీరు తదితర సౌకర్యాలను సమన్వయంతో సిద్ధం చేయాలని సూచించారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రగతి,ప్రజా సంక్షేమం,ప్రజలకు అందుతున్న ప్రభుత్వసేవలు,అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.



# జడ్చర్లలో ఎస్ఐఆర్-2026 పురోగతిపై సమీక్ష

## నోటీసుల పంపిణీ, విచారణల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్ఓ హరిప్రియ సమావేశం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన ఎస్ఐఆర్–2026 కార్యక్రమం పురోగతిపై మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 16 నాటికి నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణకు సంబంధించిన పురోగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎస్ఐఆర్–2026లో భాగంగా చేపడుతున్న చర్యలు, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్న విచారణల ప్రక్రియపై సమీక్షించారు.నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా లోపాలు గమనించినట్లయితే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విచారణల ప్రక్రియను సజావుగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని సూచించారు. అలాగే, సంబంధిత ఓటర్లు విచారణలకు హాజరై అవసరమైన వివరాలు, ఆధారాలు సమర్పించేలా వారిలో అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ, అదనపు తహసీల్దార్, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీ డిప్యూటీ తహసీల్దార్, 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధాలు అణచివేతలతో కార్మిక వర్గ ఉద్యమాలను అడ్డుకోలేరు

సిఐటియునిర్బంధాలు అణచివేతలతో కార్మిక వర్గ పోరాటాలను అడ్డుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ రావు అన్నారు .రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పాత బస్టాండ్ లో నిర్వహించిన సామూహిక నిరసన దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో,కార్మిక వర్గ పోరాటాల సందర్భంగా కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని వివిధ రంగాలు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చాయని తెలిపారు.కానీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలను అంగన్వాడీ టీచర్స్ ను రాత్రి వేళల్లో మగ పోలీసులు ఇండ్ల లోకి చొరబడి భయబ్రాంతులకు గురి చేశారని విమర్శించారు.అంతేగాక బస్సులలో, రైళ్లలో వెళుతున్న మహిళలను బలవంతంగా కిందకు దింపి నిరంకుశంగా వ్యవహరించారని విమర్శించారు. సిఐటియు నాయకుల ఇళ్లలోకి అక్రమంగా ప్రవేశించి రాత్రి వరకు పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించారని విమర్శించారు.కార్మిక వర్గ న్యాయమైన సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని, ప్రభుత్వం బాధ్యతలను విస్మరించి కార్మిక వర్గ పోరాటాలను అణచివేయడం అప్రజాస్వామికమని విమర్శించారు.హామీలు అమలు చేయలేనప్పుడు,సమస్యలను పరిష్కారం చేతగానపుడు కార్మికులకు మాట ఇచ్చి ఎందుకు మోసం చేశారని ప్రశ్నించారు.డిల్లీ నడిబొడ్డున, పార్లమెంటు కు సమీపంలోనే కార్మిక, ప్రజా పోరాటాలు,ఆందోళనలు చేస్తుంటే,రాష్ట్ర రాజధాని లో అడుగు పెట్టాలంటే ఇన్ని నిర్బంధాలు, ఆటంకాలు ఎందుకని ప్రశ్నించారు. కొంతమంది పోలీసులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వచ్చిన ఆశా, అంగన్వాడీ మహిళలపై తీవ్ర పదజాలంతో దూషించారని,నాడు కార్మిక వర్గ పోరాటాలను అణచి ప్రజాస్వామిక హక్కులను కాలరాసిన కేసిఆర్ కు పట్టిన గతే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్మిక వర్గ హక్కులపై అప్రజాస్వామిక చర్యలు అపకపోతే తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ,వీవీ నరసింహ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ సునీత,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఘట్టన్న, పట్టణ అధ్యక్షుడు పరమేశ్, వి.వో ఏ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు యం. శ్రీనివాస్, హమాలీ సంఘం నాయకుడు లక్ష్మన్న, అంగన్వాడీ టీచర్స్ యూనియన్ సీతమ్మ,నాయకులు పద్మ,కాంతమ్మ,నాగ ప్రమీల, నర్సింగమ్మ,చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి ఉప సర్పంచ్

## - మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో పలువురి చేరిక

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

భూత్పూర్ మండలంలోని ఏవీఆర్ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ జైపాల్ నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో వారు బీఆర్ఎస్ కండువాలు కప్పుకుని పార్టీలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉప సర్పంచ్ జైపాల్ నాయక్‌తో పాటు ఎస్. శ్రీను నాయక్, దశరథ్, గోపాల్, తారునాయక్, బాలు, హనుమంతు, రవి, బిమ్లా, రాజు తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, స్థానికంగా ప్రజాప్రతినిధిగా ఉన్న ఉప సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు ఒకేసారి బీఆర్ఎస్‌లో చేరడం భూత్పూర్ మండల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా సిరిసిల్ల రాజయ్య

## - ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యఅతిథిగా నియమించింది. ఈ మేరకు ఆయన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికిఅధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘనంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ, వేదిక ఏర్పాట్లు, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు తదితర సౌకర్యాలను సమన్వయంతో సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

# అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా గోపాల్ రెడ్డి ఎన్నిక



## - అభినందనలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్గా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దు పాల గోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అచ్చంపేట మండలం యువ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాజీ కౌన్సిలర్ గౌరీ శంకర్ మార్కెట్ చైర్మన్గా ఎన్నికైన గోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బాంధవుడు రైతుల సంక్షేమం కొరకు ఆయన కృషి చేస్తారని ఈ సందర్భంగా కొనియాడారు.

# చిన్నంబావి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

## - వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

## - గ్రామాల్లో నెలకున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: మండల సర్పంచులు...

చిన్నంబావి సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనపర్తి జిల్లా డిపిఓ, మరియు మండల స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల ప్రగతితో పాటు నిధుల వినియోగంపై అధికారులు సుదీర్ఘంగా సమీక్షించారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, చివరి లబ్దిదారుడి వరకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు.వానాకాలం తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడటంతో పాటు పారిశుధ్య నిర్వహణను పక్కాగా చేపట్టి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు వహించాలని నిర్ణయించారు. నిరంతర విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పనుల ప్రగతిపై శాఖల వారీగా పూర్తి వివరాలను అధికారులు సభకు వివరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి హాజరైన సర్పంచులు తమ పరిధిలోని డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి కొరత మరియు రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకువచ్చారు..సర్పంచులు లేవనెత్తిన ప్రతి సమస్యపై ఎంపీడీవో మరియు సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో సాగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల రూపురేఖలు మార్చాలని







పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్ రెడ్డి, ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ రామస్వామి, ఏపీఓ,ధనుంజయరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు పలుశాఖల అధికారులు, పాల్గొన్నారు.

# చిన్నంబావి మండల సర్వసభ్య సమావేశంలో కుప్పకూలిన ఏపీఎం అనిల్‌కుమార్

- తహసీల్దార్ సమయస్ఫూర్తితో ఏపీఎంకు ప్రాణాపాయం తప్పింది!
- వెంటనే స్పందించి సీపీఆర్ చేసిన తహసీల్దార్ శ్రీనివాస్
- 108లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు





**చిన్నంబావి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా మండల ఇన్చార్జి ఏపీఎం అనిల్‌కుమార్ ఒక్కసారిగా కళ్లు తిరిగి కుప్పకూలడం కలకలం రేపింది. సమావేశంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో తహసీల్దార్ శ్రీనివాస్ అప్రమత్తమై వెంటనే ఏపీఎం వద్దకు చేరుకుని సీపీఆర్ చేయడంతో పాటు అత్యవసర ప్రాథమిక చర్యలు చేపట్టారు.అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి గ్లూకోజ్ ఎక్కించారు. ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం వనపర్తికి తరలించినట్లు తెలిసింది. ఏపీఎం కుప్పకూలిన వెంటనే స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస్ చర్యలను అక్కడున్న అధికారులు, సిబ్బంది అభినందించారు.

### 'పని ఒత్తిడితోనే కుప్పకూలా'

చికిత్స అనంతరం ఇన్చార్జి ఏపీఎం అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పని ఒత్తిడి కారణంగానే ఆరోగ్యం సహకరించక కళ్లు తిరిగి కిందపడిపోయానని తెలిపారు. గతంలో జరిగిన ప్రమాదంలో తన చేతికి గాయమైందని, అప్పటి నుంచి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు.తాను సుమారు 20 ఏళ్లుగా వనపర్తి జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఇటీవల చిన్నంబావి మండల ఏపీఎంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఒత్తిడికి గురవుతున్నానని పేర్కొన్నారు. చిన్నంబావి మండల ఇన్‌చార్జి బాధ్యతలు వద్దంటూ ఇప్పటికే రెండుసార్లు అధికారులకు లేఖలు ఇచ్చినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తన ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని చిన్నంబావి ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి వనపర్తి జిల్లాలోనే విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు.సమావేశంలో ఏపీఎం ఏపీఎం కుప్పకూలిన వెంటనే స్పందించి సీపీఆర్ చేయడంతో పాటు ఆసుపత్రికి తరలించే వరకు పరిస్థితిని పర్యవేక్షించిన తహసీల్దార్ శ్రీనివాస్ సమయస్ఫూర్తిని అధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, బుక్‌కీపర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల

## - పెద్దకొత్తపల్లి మండలం కేంద్రం లో సాయుధ రైతంగ పోరాట వేడుకలు

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపించింది,ముమ్మాటికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని సగర్వంగా చెప్పడం జరుగుతోందని సిపిఐ నాయకులు ఎం బాల నరసింహ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విమోచన కొరకు 4500 మంది ప్రాణార్పణ చేయడం జరిగిందని ఆయన వ్యాఖ్యానించారు, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని ఆయన పేర్కొన్నారు, అదేవిధంగా 10 వేల గ్రామాలను విముక్తి చేయడం జరిగిందన్నారు.సెప్టెంబర్ 17 తేదీని తెలంగాణ స్వాతంత్ర దినోత్సవం గా ప్రకటించాలి,ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు,